# మెట్లులేని నిచ్చెన




**అడుగడుగునా సమస్యలు ఎదురయ్యే జీవితాన్ని అర్థం చేసుకొనడానికి శ్రీవిరించి కథలు తోడ్పడతాయి. ఆయన మూడు దశాబ్దాలలో 200కు పైగా కథలు రచించారు.**

సుందరమ్మ మనసుకు చాలా చికాకు అనిపిస్తోంది. అప్పుడప్పుడే నిద్ర పట్టబోతోంది. చదువుతూ ఉన్న పుస్తకం పక్కకు పెట్టి, ట్యూబ్ లైట్ ఆఫ్ చేసి, బెడ్ లాంప్ స్విచ్ నొక్కి అలా మంచం మీద నడుం వాల్చిందో లేదో పక్క గదులలో నుంచి పిల్లవాడి ఏడుపు వినబడడం మొదలయింది. ఓ పక్కకు ఒత్తిగిలి పడుకుంది. పిల్లవాడు ఏడుపు ఆపేస్తాడు, నిద్రకేమీ భంగం ఉండదు అనుకుంది. ఊహుఁ. అలా జరగలేదు. తాను ఏమీ చేయగల స్థితి కాదు. అలాగని ఊరుకుండడానికీ వీలులేదు.

పక్కగదులలో నుంచి చప్పుళ్ళు వినవస్తూనే ఉన్నాయి. ముందు కాత్యాయని మంచం మీదనుంచి లేచింది. పాలు ఫ్లాస్కులో నుంచి సీసాలోనికి పోసింది. లాలనగా పిల్లవాడిని ఒడిలోనికి తీసుకుంది. పిల్లాడి లేత పెదాలకు పాలసీసా నిపిల్ అందించింది. ఇవన్నీ వినిపిస్తున్న చప్పుళ్ళకు అనుగుణంగా ఊహించుకుంది సుందరమ్మ. క్షణంసేపు ఏడుపు ఆగిపోయింది. 'అమ్మయ్య. పిల్లవాడు బుద్ధిగా పాలు తాగుతూ ఉన్నాడు. పాలు తాగి పడుకుంటాడు. ఇంకేం ఇబ్బంది ఉండదు. హాయిగా నిద్ర పోవచ్చు' అనుకుంది. కాత్యాయని కునుకు తీస్తుంది.

పాపం, ఆ పిల్ల పగలంతా ఏదో పని చేస్తూనే ఉంది. క్షణం విశ్రాంతిగా

చిత్రాలు - పి.ఎస్.బాబు



కూర్చోదు. కలత నిద్ర ఎలాగూ కదలబారింది కనుక సుందరమ్మ అంతవరకు చదువుతూ ఉన్న పుస్తకం చేతుల్లోనికి తీసుకుంది. పది నిమిషాలు చదివిందో లేదో కళ్లు మళ్లీ మూతలు పడిపోయాయి. నిద్ర పోవడం తెలియనే తెలియదు.

కానీ, మెలకువ రావడం మటుకు తప్పనిసరిగా తెలుస్తుంది. పిల్లవాడి ఏడుపు. అదొకటే గుర్తు. ఏడుపు వినబడడం ఏమిటి. మెలకువ రావడం ఏమిటి - సుందరమ్మ చేసే మొదటి పని గోడ గడియారం వంక చూడడం. టైం చూసుకొన్నమీదట తాను ఎంతసేపు నిద్రపోయిందీ తెలుస్తుంది. ఓ నలభై నిమిషాలు - అంతే అనుకోగానే ఎక్కడలేని విసుగు, చికాకు ముంచుకు వస్తుంది.

పగలయినా, రాత్రయినా హాయిగా నిద్ర పోవడానికి లేకుండా పోతోందే, ఇదెక్కడి వైపరీత్యం? ఒక్కోసారి పక్క గదుల్లో పిల్లవాడు గుక్కపట్టి ఏడుస్తాడు. తల్లి కాత్యాయని ఎంత సముదాయించుదామని ప్రయత్నం చేసినా ఒక పట్టాన సమాధానపడడు. కాత్యాయనికీ విసుగు వస్తుంది. జోలపాట ఆపేస్తుంది. కాత్యాయని జోలపాట మొదట్లో సుందరమ్మకు ఆనందంగానే ఉండేది.

'రామ లాలీ మేఘశ్యామ లాలీ...' అని సన్నటి గొంతుతో లలితంగా, మధురంగా కాత్యాయని పాడుతూ ఉంటే సుందరమ్మకు తన చిన్ననాటి రోజులు గుర్తుకు వచ్చేవి. అమ్మ ఈ పాట పాడేది. తమ్ముళ్లందర్నీ ఈ పాటతోనే నిద్ర పుచ్చింది అమ్మ. ఈ సంగతి సుందరమ్మకు చాలా బాగా గుర్తు. ఎందుకనో కానీ - ఈ పాట మాత్రం తనకు అబ్బలేదు. "జో అచ్యుతానంద జో...జో ముకుంద' - అంటూ పాడేది తను అంతగా అవసరం అయినప్పుడు. అయినా, తన పిల్లలు జోల పాటల అగత్యం లేకుండానే హాయిగా నిద్రకు పడేవాళ్లు. నిద్ర పోవడం కోసమే పుట్టామా అన్నట్లుండేది వాళ్ల చిన్నతనం.

లాలి, జోల పాటలు నేర్చుకోవడం ఆడపిల్లల 'గృహశిక్షణ'లో ఒక భాగంగా ఉండిపోయేది వెనకటి రోజుల్లో. ఇప్పుడంత తీరిక ఏదీ పిల్లలకు?

కాలేజీకి వెడుతున్నారంటే - పాటలు పాడుకోవడానికీ, కమ్మని కథలు చెప్పుకోవడానికీ సమయ విరామం ఎక్కడ నుంచి వస్తుంది?

ఏమిటో-జీవితం అంతా అతలాకుతలంగా మారిపోయింది.

వెనకటి రోజులు వేరు, ఆ ఏర్పాట్లు వేరు. ఇప్పుడంతా ఉరుకులు, పరుగులు.

ఆమె ఇలా ఆలోచించుకుంటూ ఉండగా - మళ్లీ పిల్లవాడి ఏడుపు వినిపించింది. ఏమిటీ మాయదారి పిల్లాడు? పిల్లవాడు కాదు కానీ కాత్యాయని బతుకు బండబారేట్లు చేస్తున్నాడు. ఏడవడానికి అంత శక్తి ఎక్కడనుంచి వస్తుందో వాడికి! కాత్యాయని ఓపికగా అమరుస్తుంది. అయితేనేం, వాడికి ఏదో అసౌకర్యం, అనుకూలం. ఇలా నిద్రకు ఉపక్రమించినప్పుడల్లా పగలనీ, రాత్రనీ చూడకుండా పట్టుమని పది నిమిషాలయినా గడవకుండానే ఏడుపు లంకించుకుని కూచుంటాడు వాడు, తాను నిద్ర పోకూడదని ఎవరో శాపం పెట్టినట్లుగా.

ఆలోచిస్తున్నప్పుడు తమాషా అనిపిస్తుంది కానీ, మాంచి నిద్రలో ఉన్నప్పుడు కంచుగంటలాగ వాడి గొంతు మోగినప్పుడు అనిపిస్తుంది - అసలు ఎవరు ఈ కాత్యాయని? ఇంత అసౌకర్యంగా ఉన్నప్పుడు వెంటనే ఇల్లు ఖాళీ చేసి పొమ్మని చెప్పడానికి తాను ఎందుకు జంకాలి?

అబ్బవంక చుట్టమా, అమ్మ వంక చుట్టమా ఈ కాత్యాయని తనకు? మూడు నెలల క్రితం ఈ మనిషి ఎవరో తనకు తెలియను కూడా తెలియదు.

ఊరికి దూరంగా విసిరేసినట్లు ఉన్నదని చెప్పలేం కానీ, సుందరమ్మ డాబాఇల్లు చుట్టుపక్కల ఇళ్ళకు బాగా దూరమే. చుట్టూ చక్కటి ప్రహరీ గోడ. గోడ పొడుగునా పూల చెట్లు. ఇంటిచుట్టూ ఆవరణ. ఆకర్షవంతమైన లాన్. ఆరు గదుల విశాలమైన ఇల్లు. ఇంత పెద్ద ఇంటిలో సుందరమ్మ ఇప్పుడు ఒంటరి మనిషి. భర్త మిలిటరీ సర్వీసు నుంచి రిటైర్‌మెంట్ తీసుకుని వచ్చిన తర్వాత ఇక్కడ ఈ ఇల్లు కట్టుకున్నారు. అప్పటికే పిల్లలు పెద్దవాళ్లయి ఎవరి ఉద్యోగాలు, ఎవరి సంసారాలు వాళ్లు చూచుకుంటున్నారు.

ఇద్దరు కొడుకులు. ఒక్కతే అమ్మాయి. చక్కగా చదువులు చెప్పించారు; చదువులకు తగిన సంస్కారం వాళ్లే సంపాదించుకున్నారు. జీవితం సజావుగా, సంతోషంగా గడిచిపోతోంది. భర్తతో పాటు 'సర్వీస్'లో విదేశాలు కూడా చూసి వచ్చింది సుందరమ్మ. ప్రపంచం నాలుగు మూలల కలయ తిరిగింది. కనుకనే ఒక విధమైన మొండి ధైర్యం, సాహసం, ఒంటరితనం పట్ల దిగులు లేకుండా ఉండడం అలవాటు అయినాయి. కొడుకులు ఇద్దరూ విదేశాలలోనే సెటిల్ అయినారు. అయితేనేం - సర్వీస్ పూర్తి కావడం తోటే నాన్నగారికి లాగానే స్వదేశానికి తిరిగి వచ్చేసి నీ దగ్గరే ఉండిపోతాం అంటారు. మాట మాత్రం అంటారు కానీ, వాళ్లకు ఇది సాధ్యపడదని సుందరమ్మ బాగా ఎరుగును. ఎందుకంటే - వాళ్ళ భార్యలు ఈ దేశం వాళ్లు కారు. పిల్లలకు ఇక్కడ 'రూట్స్' ఉన్నట్లు తెలియదు. పూర్తిగా 'వెస్ట్రనైజ్' అయిపోయిన కుటుంబాలు.

కూతురు కూడా అంతే. భారతీయుడినే చేసుకుంది. అయినా, ఆస్ట్రేలియాలో ఇమ్మిగ్రేషన్ అయిపోయినాక మళ్లీ ఇక్కడకు వచ్చే పనేం? వచ్చినా చుట్టపు చూపు. రెండు నెలలు ఒక్కబిగిని ఉంటే అదే గొప్ప.

**మళ్ళీ పిల్లవాడి ఏడుపు వినిపించింది. పిల్లవాడు కాదుగాని కాత్యాయని బతుకు బండబారేట్లు చేస్తున్నాడు.**

“మీకు ఎంత చేస్తే ఈ రుణం తీరుతుంది? కరవుతీరా నమస్కారమైనా చెయ్యనివ్వండి రోజూ పొద్దునపూట.”

సుందరమ్మ భర్త మాత్రం ఈ దేశం అంటే, ఈ ప్రాంతం అంటే మక్కువ పెంచుకుని కావాలని ఇక్కడకు వచ్చేసి సెటిల్ అయిపోయాడు. ఈ ఇల్లు కట్టుకుని, అన్ని కనీస సౌకర్యాలు అమర్చుకుని ఇక్కడే పాతిక సంవత్సరాలుగా హాయిగా, విశ్రాంతిగా కాలక్షేపం చేశారు దంపతులు.

‘డెబ్బయ్యో ఏట నాకు మారకం ఉంది, సుందరమ్మా’ అనే వాడు భర్త.

‘అప్పటి మాట చూసుకుందాం, తొందరేం లేదు లెండి-’ అని ఒరగేస్తూ వచ్చింది ఆమె, భర్త మాట నమ్మీ నమ్మకుండా. ఏమీ అనారోగ్యం లేకుండా మధ్యాహ్నం నిద్రలోనే నిశ్వాసం నిలిపి వేశాడు. టెలిఫోన్ చేస్తే డాక్టర్ వచ్చి ‘డెత్ సర్టిఫికెట్ పంపిస్తాను. మరేం కంగారు పడకుండా జరగవలసిన ఏర్పాట్లు చూసుకోండి’ అని చెప్పేసి వెళ్లిపోయాడు. అంతే.

అంతా ఓ సంవత్సరం కిందటి మాట.

పిల్లలకు టెలిఫోన్‌లో కబుర్లు వెళ్లాయి. ముగ్గురూ మూడోనాటికి రాగలిగారు. నాలుగు రోజులు ఊరడించి వెళ్లిపోవడం తప్ప వాళ్ళు చేయవలసిన పని ఇంకేమీ లేకపోయింది.

‘జీవితం అంతా కలిసి గడిపాం. ఈ ఇంట్లో హాయిగా పాతికేళ్లు కాపురం చేశాం. ఇప్పుడు ఆయన లేరు గదా అని నేను పిల్లల దగ్గరకు వెళ్ళను. నా తనువూ ఇక్కడే తెల్లవారిపోవాలి’ అని తీర్మానించుకుంది సుందరమ్మ.

ఒంటరిగా ఉంటేనేం?

అంతా తెలిసిన ఊరు. అందరి మర్యాదలు, మన్ననలు పొందుతున్న ప్రదేశం. ఆయనకు బోలెడంత ఆప్తవర్గం. ఇంకేం వెదుక్కోవలసిన పని లేదు.

ఇంకో నాలుగేళ్లకు తనకూ డెబ్బయి వస్తాయి అనగా సుందరమ్మ ఎవరికీ బరువు లేకుండా, ఎవరిపైనా ఆధారపడకుండా హాయిగా గడిపివేస్తోంది రోజులు. ఎవరైనా వచ్చి ఏదేనా సలహా అడిగితే - తనకు తోచిన సంగతులు చెబుతుంది. ఇతరుల విషయాలలో కలుగజేసుకోదు. ఉత్తరాలు - టెలిఫోన్ సంభాషణలు - పిల్లలతో. పత్రికలు, పుస్తకాలు, రేడియో, టి.వి - ఇవన్నీ చక్కటి కాలక్షేపం.

అలాంటి పరిస్థితిలో ఒకనాడు వచ్చాడు ఓ పాతికేళ్ల పడుచు కుర్రాడు.

చక్కటి దుస్తుల్లో ‘స్మార్ట్‌నెస్’ మూర్తీభవించినట్లుగా ఉన్నాడు.

సుందరమ్మను చూడగానే వినయంగా నమస్కారం చేశాడు.

‘ఎవరు నాయనా, ఏం కావాలి?’ అంది.

అప్పుడు విప్పాడు తన జీవిత పుస్తకం... .ఎం.ఏ. చదువుకున్నాట్ట. ఎన్నాళ్లయినా ఉద్యోగం దొరకలేదట. ట్యూషన్లు చెబుతూ, ట్యుటోరియల్‌లో పని చేస్తూ ఎలాగో కాలక్షేపం చేస్తున్నాట్ట. ఇప్పుడు ఈ ఊళ్ళో ఓ ప్రయివేట్ కంపెనీ ఉద్యోగం ఇస్తానన్నదట.

అయినా, అదేం ఉద్యోగం?

పాఠాలు చెప్పేది కాదు, పిల్లలను తీర్చి దిద్దేది కాదు. పుస్తకాలు తయారు చేసే కంపెనీలో సేల్స్ జాబ్. జీతం బాగానే ఇస్తారు. అమ్మకాల మీద బోనస్ ఇస్తామన్నారు. కాకపోతే జిల్లా అంతా తిరగాలి. కాలేజీలు, స్కూళ్లు - వాళ్ల అధికారుల్ని కలుసుకుని, వాళ్ల చేత తన కంపెనీవాళ్లు తయారుచేసిన పుస్తకాలు, పంపకం చేసే అట్లాసులు, ఎన్‌సైక్లోపెడియాలు కొనిపించాలి. శ్రీమంతుల పర్సనల్ లైబ్రరీలో వాటితో నింపించాలి. కాస్త ‘టఫ్’ జాబ్. అయినా ‘ఛాలెంజింగ్’గా ఉంటుందని ఒప్పుకున్నాడట. నిలకడ అయిన ఆదాయం వచ్చే ఉద్యోగం ఇదే మొదలు దొరకడం. అందుకని సరే నన్నాడు. చేరాడు.

‘నాయనా, పెళ్లి చేసుకున్నావా? పిల్లలా?’ అనడిగింది.

అతను ఒక్కమారు ఉలిక్కిపడ్డాడు.

తన అదృష్టమంతా ఇవ్వబోయే జవాబు మీదనే ఆధారపడి ఉన్నట్లు, వెన్నుపూసలో జరజర పాకుతున్న మహా శక్తి కదలిపోతున్నట్లు అనిపించింది.

‘అదే చెప్పొస్తున్నానండీ. ఉండడానికో ఇల్లు కావాలండీ. ఓ గదయినా సరిపెట్టుకుంటామండీ. ఆవిడ ఇప్పుడు కనే రోజులు కూడాను. పెద్ద దిక్కు ఎవరూ లేరు. నా కుటుంబ పరిస్థితులు విన్నవాళ్లు ఎవరూ ఇల్లు ఇవ్వడానికి ఒప్పుకోవడం లేదు’ అన్నాడు దీనంగా.

కష్టపడి పని చేయవలసిన ఉద్యోగం కోసం-

కడుపు నిండా తిని విశ్రాంతి తీసుకునే ఇంటి కోసం మనుమలు ఇలా దేబిరించ వలసివస్తోందే అని క్షణంపాటు నివ్వెరపోయింది సుందరమ్మ.

‘మిమ్మల్ని అడుగవచ్చునో లేదో నాకు తెలియదండీ. దయచేసి మీ ఇంట్లో ఓ గది - అవుట్ హౌస్ అయినా సరే - ఇస్తే చాలునండీ’ అన్నాడు.

అవుట్ హౌస్‌లో పనికిరాని సామానంతా తీర్చి దిద్దింది వారం రోజుల క్రిందటనే, ఇద్దరు మనుమల సాయంతో.

ఇస్తే- ఇంట్లోనే ఓ గది, వరండా ఇవ్వాలి. అంతేకాని అవుట్ హౌస్ ఇవ్వడం కుదరని పని.



అయినా ఎవరో ముక్కు, ముఖం తెలియని వాడిని. భార్యను - అందులోను కనబోయేదాన్ని - ఇంట్లో తెచ్చిపెట్టుకోవడం...!

పుట్టుపూర్వోత్తరాలు అడిగితే దాపరికం లేకుండా చెప్పాడు. ఈ రాష్ట్రం కాదు.

కాలేజీ పరిచయాల్లో ప్రేమ ముదిరి ‘తొందర’ పడ్డాడు. అమ్మాయి తల్లిదండ్రులకు ఇష్టం లేకపోయింది. అందుకని పిల్లను తీసుకుని మరో రాష్ట్రం వెళ్లిపోయి, ఎలాగో పొట్టపోసుకుని కాలక్షేపం చేస్తున్నాడు. తననే నమ్ముకున్న కాత్యాయనికి అన్యాయం చేయడం ససేమిరా జరగని పని. పెళ్ళంటూ చేసుకోలేదు కానీ, రేపు ఆ పిల్లకు కలగబోయే సంతానానికి తానే తండ్రి. ఈ సంగతి - చూచాయగా తెలిసిన ఎవరూ ఇల్లు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. స్థానికుడు కాకపోవడం మొదటి అభ్యంతరం. పైన ఈ గొడవలు!

‘అమ్మాయిని తీసుకువచ్చి చూపించు. అప్పుడు చెబుతాను’ అంది సుందరమ్మ. ఓ గంటలోనే తీసుకువచ్చాడు, హోటలు గదిలో విశ్రాంతి తీసుకుంటున్న కాత్యాయనిని. ఆ అమ్మాయికి ఓ వారం రోజుల్లో ‘పురుడు’ వస్తుందని అంచనా వేసుకుంది సుందరమ్మ. ఆ అమ్మాయి చెప్పిన లెక్కలు కూడా అందుకు సరిపోయాయి. ‘ఆస్పత్రిలో డెలివరీకి ఏర్పాట్లు చేయిస్తాను. తర్వాత నైనా ఇల్లు కావాలిగా’ అన్నాడు దీనంగా ముఖం పెట్టి.

ఆ ముఖంలో సుందరమ్మకు ఏవో పోలికలు కనిపించాయి. పెద్ద కొడుకో, చిన్న కొడుకో - ఈ వయసులో ఇలాగే ఉండేవాడు. ఆమెకు స్పష్టంగా తెలియదు. కానీ - ఈ కుర్రవాడికి సహాయం చేయాలి అనుకుంది. పైకి మాత్రం గంభీరంగా ‘సరే. జాగ్రత్తగా ఉంటానంటే, ఆ పక్కగది - దానిని ఆనుకున్న వంట పసారా, చిన్న హాలు ఇస్తాను. నేను ఒంటరిదాన్ని. నిశ్శబ్దంగా ఉండడం అలవాటు నాకు. ఏమీ చప్పుళ్లు, అల్లర్లు జరగగూడదు. నాకు ఇష్టం లేకపోతే చెప్పిన నాలుగు రోజుల్లో ఇంట్లోంచి వెళ్లిపోవాలి’ అంది.

‘మీరు ఎట్లా చెబితే అట్లా ఉంటాం. మేం ఎంత మంచివాళ్ళమో మీకే తెలిసివస్తుంది, అత్తయ్యగారూ’ అంది కాత్యాయని అప్పుడే.

ఈ పిల్లకు అత్తగారి ఆరళ్లు లేకపోవడం ఒక లోపంలా ఉన్నట్లుంది. మనసులో అనుకుంది సుందరమ్మ.


ఆస్పత్రిలో పురుడు పోసుకుని మూడో నాడే వచ్చింది కాత్యాయని.

ఆమె మొగుడు - అతని పేరేమిటో కూడా సుందరమ్మ గమనంలో పెట్టుకోలేదు. దాదాపు పగలంతా ఇంట్లో ఉండడు. ఉదయం, సాయంత్రం టీ, కాఫీ తానే పెట్టుకుని తాగుతాడు. కాత్యాయనికీ ఇస్తాడు.

‘నాకోసం ఎలాగూ వంటమనిషి పని చేస్తోంది. మీ కిద్దరికీ అన్నం, చారు, కూర కూడా చేయిస్తాను - నీకాస్త ఒంటికి ఓపిక, బలం పట్టేంతవరకు మొహమాటం లేకుండా అన్నీ తీసుకో. ఆరోగ్యం జాగ్రత్తగా చూచుకోవడం అవసరం నువ్వు. లేకపోతే నీకే ఇబ్బంది’ అంది సుందరమ్మ.

కాత్యాయని పైకి ఏమీ అనకుండా మనసు నిండా కృతజ్ఞత నింపుకుంది.

‘రోడ్డు మీద - దిక్కు దివాణం లేకుండా పోవలసిన మనుషుల్ని మమ్మల్ని తీసుకువచ్చి కడుపులో పెట్టుకున్నారు. మీకు ఎంత చేస్తే ఈ ఋణం తీరుతుంది? అయినా, మీకు మేం ఏం చేయగలం? కరవుతీరా నమస్కారమైనా చెయ్యనివ్వండి రోజూపొద్దున పూట-’ అన్నాడు ఆ అబ్బాయి.



**భార్య-భర్త గట్టిగా మాట్లాడుకోలేక, నవ్వలేక వాళ్ళ ఇంట్లోనే వాళ్ళు దొంగల్లాగ ప్రవర్తించడం చూస్తే సుందరమ్మకు కష్టంగా ఉంది.**

'మా అబ్బాయికి మామయ్యగారి పేరు పెట్టుకుంటాం, అనుమతి ఇవ్వరూ?' అంది కాత్యాయని నామకరణం రోజున.

పెద్ద తంతు ఏమీ లేదు. సుందరమ్మ చేతనే 'సహదేవ్' అని మూడు మార్లు పిలిపించారు. అలా పిలుస్తున్నప్పుడు అంత వయసులోనూ ఆమె బుగ్గలు కెంపులు కావడం కాత్యాయని దంపతులు గమనించగలిగారు.

సహదేవుడు బోసి నవ్వుల్తో సుందరమ్మను మంచి చేసుకుంటున్నాడు.

పిల్లవాడికి కావలసినవన్నీ తనకు తెలియకుండానే అమరుస్తోంది సుందరమ్మ.

'రాత్రి మీకు మరీ ఇబ్బంది అయినట్లుంది. నాకేం తోచడం లేదు. సహదేవ్ ఆగడం ఎక్కువయిపోతోంది. సముదాయించ లేకపోతున్నాను-' అన్నది కాత్యాయని.

'పిల్లవాడు ఏడవకుండా చూసుకో చాలు' అంది సుందరమ్మ.

'అమ్మాయీ, మీ అమ్మకు- నాన్నకు తెలియపరచావా ఈ సంగతి?' అనడిగింది సుందరమ్మ ఒకనాడు. 'లేదండీ' అంటే ఎందుకని అడిగింది.

'నా ముఖం చూడడమే ఇష్టం లేదన్నారు వాళ్లు ఇద్దరూ. వాళ్లకు నేనేమయిపోయినానో అన్న ధ్యాసే లేదు. ఏమయిపోయినా వాళ్లకు పట్టదు. దూరం అయిన వాళ్లను మళ్లీ దగ్గరకు చేర్చుకుని లేనిపోని నటనలు చేయడం నాకు ఇష్టం లేదు అత్తయ్యగారూ' అంది. సుందరమ్మ ఇకపై ఏమీ రెట్టించలేదు.

అనుకూలమైన పరిస్థితులు వచ్చి వీళ్లు తమ దారిన తాము పోతే... అప్పుడు మళ్లీ ఒంటరితనంలోనికి తాను కుంచించుకుపోవచ్చు. కానీ... తనకు అననుకూలం. మిట్టమధ్యాహ్నం, అర్ధరాత్రి... పిల్లవాడి ఏడుపులు. కాత్యాయని జోలపాటలు.

భార్య - భర్త గట్టిగా మాట్లాడుకోలేక, మనసు నిండుగా - నిబ్బరంగా నవ్వుకుంటూ కాలక్షేపం చేయలేక వాళ్ల ఇంట్లోనే వాళ్లు దొంగల్లాగా, ఎంక్రోచ్‌మెంట్ చేస్తున్న వాళ్ళలాగా ప్రవర్తించడం చూస్తే సుందరమ్మకు కష్టంగా ఉంది.

'మీ ఇష్టం వచ్చినట్లు హాయిగా ఉండండి-' అనడానికి మళ్లీ నోరు రాదు, జంకు. కాస్త లైసెన్స్ ఇస్తే నెత్తికెక్కి కూర్చుంటారేమో? ఎవరిని ఏమని నమ్మడానికి ఉంది ఈ రోజుల్లో?

జూనియర్ సహదేవ్ వాళ్ళకు ఈ ఇంటిమీద అధికారాలు ధారదత్తం చేసేస్తున్నట్లున్నాడు, చూడబోతే.

మధ్యాహ్నం ఒంటిగంటకు ఇంటికి వస్తాడు, అతడు డోర్ బెల్ మోగించడు, తనకు ఇబ్బంది అని. కాత్యాయని వీలయినంతవరకు గుమ్మంకేసి కళ్లు పడవేసి కనిపెట్టుకుని ఉంటుంది. పిల్లిలాగ అడుగులు వేస్తారు ఇద్దరూ. గిన్నెలు, గట్ర చప్పుడు కాకుండా జాగ్రత్త పడతారు. వాళ్లు గట్టిగా ఆవలించడం కూడా మరిచిపోయారా - అనిపిస్తుంది సుందరమ్మకు. ఆమెకు స్పష్టంగా తెలిసిన విషయం- వాళ్లకు ఎంతో ఇబ్బంది, ఇరుకు అవుతోంది. అయినా, తన రక్షణలో హాయిగా, విశ్రాంతిగా ఊపిరి పీల్చుకుంటున్నారు. ఈ వయసులో ఉండాల్సిన స్వేచ్ఛ లేకపోయినా, రక్షణ మాత్రం దొరికింది.

వాళ్ల వల్ల తనకు చాలా ఇబ్బంది అవుతున్నమాట నిజమే. రొటీన్ అంతా తల్లకిందులయిపోయింది. పిల్లవాడికి కాస్త నలత చేస్తే తానే తెలుసుకుని డాక్టర్‌కు ఫోన్ చేయాలి. మందు ఇవ్వడం సమయానికి గుర్తు చేయాలి. పిల్లవాడి నవ్వులు, కేకలు, చప్పుళ్లు, రొదలు - ఇవన్నీ భరించాలి. 'మా వల్ల మీకు చాలా శ్రమ' అంటాడు అతను. కాదు-లేదు అనదు సుందరమ్మ. గంభీరంగా ఉండిపోతుంది.

నీ కారుణ్యం-సానుభూతి - ఇవన్నీ మనసులోనే అట్టేపెట్టుకో. పైకి మాత్రం సీరియస్‌గా, నిర్మొహమాటంగా ఉన్నట్లు నటించు. కాస్త కనికరం చూపావో, అవతలి వాళ్ల కళ్లు నెత్తికి ఎక్కిపోతాయి. ఈ ప్రపంచంలో ఉంటూనే, దీనితో ఏం సంబంధం లేనట్లు కనిపించాలి. లేకపోతే, ప్రపంచంలో నిభాయించుకు రాలేం - అని చెప్పేవాడు సుందరమ్మ భర్త.

జీవితాన్ని గురించి ఇటువంటి కిటుకులన్నీ ఎన్నో నేర్చుకుంది ఆమె. వాటిని ఉపయోగించే తరుణం మటుకు బహు అరుదుగా తారసపడుతూ ఉంటుంది.

పిల్లవాడికి చాలా సుస్తీ చేసింది ఒకమారు.

అతడు - తండ్రి - ఊళ్ళో లేడు.

రెండు రోజులకు కానీ రాడు.

సుందరమ్మ డాక్టర్‌కు ఫోన్ చేసి కావలసిన ఏర్పాట్లన్నీ చేసింది. భరోసా ఇచ్చాడు డాక్టర్. ఏం ఫర్వాలేదు.

కాత్యాయని గుడ్లనీళ్ళు కుక్కుకుని కూర్చుంది.

కడుపు నిండా ఏడవడానికైనా ధైర్యం లేదు, ఆ పిల్లకు- సుందరమ్మ తను పడ్డ శ్రమ కంటే, కాత్యాయని అసహాయతకు ఎక్కువ బాధ పడుతోంది.

వేళకాని వేళ ఏదో చేయవలసి వస్తుంది వాళ్ల కోసం, పిల్లవాడి సౌకర్యం కోసం. డబ్బుకు ఏమీ ఇబ్బంది లేకపోయినా, వాళ్ల కోసం చేసే ఖర్చు కూడా లెక్కకు మించిపోతోంది. ఎందుకు ఈ జంజాటమంతా తనకు?

ఎవరో ముక్కు, ముఖం తెలియని వాళ్ళను తెచ్చి ఇంట్లో పెట్టుకున్నానని పిల్లకు కూడా చెప్పలేదు ఆమె ఉత్తరాల్లో కానీ, టెలిఫోన్ కాల్స్‌లో కానీ.

తన అవివేకానికీ, అలౌకికానికీ నవ్వుకోరూ వాళ్లు?

ఒంటరిగా ఉండడం కష్టం అయితే - వెంటనే విమానం ఎక్కివేయమని ముగ్గురూ మూడు టిక్కెట్లు పంపినా పంపుతారు.

సుందరమ్మకు ఆలోచనలతో ఎక్కువ సమయం గడిచిపోతోంది.

కాత్యాయని కోడలు లాగ అణగి మణగి ఉంటోంది.

ఎందుకు ఈ పిల్ల మీద తన ఆధిపత్యం? తెలియకుండా, తెలపకుండా పెద్దరికం తనమీద వచ్చి పడింది ఎందుకని?

చదువుకోవలసిన పుస్తకాలు పేరుకుపోతున్నాయి.

ఇదివరకటి చురుకుదనం, చదువుకుందామన్న ఆసక్తి తగ్గిపోతున్నాయి. తనేదో పరీక్షకు తయారవుతోందని కాదు. కానీ, చదవడంలో తనకున్న అభిరుచి కాస్త గుంట పెట్టి గంట వాయించేసినట్లు అయిపోతోంది.

అర్ధరాత్రి రేడియో - టి.వి. బాహాటంగా పెట్టుకుని వినడానికి జంకు - పిల్లవాడికి ఇబ్బంది అవుతుందేమోనని. కాత్యాయనిని, ఆమె భర్తను, కొడుకును - ఎక్కడో అనుకూలమైన మరో జాగా చూసుకుని 'నన్ను నాకు వదిలెయ్యండి' అనడగడం తేలికే. అడిగిన నాలుగయిదు రోజుల్లో వాళ్లు శిరసావహిస్తారు. తాను పెట్టిన నియమం అదొక్కటే. దాన్ని వాళ్లు ఉల్లంఘిస్తారనుకోవడానికి ఏదైనా కారణం కనిపించదు. అయినా, సుందరమ్మకు ఆ ప్రసక్తి తీసుకురావడం అసాధ్యం అయిపోతోంది. ఇలా చేద్దామన్న ఆలోచన కూడా మనసులో స్థిరంగా కూర్చోవడం లేదు.

ఎందుకని ఇలా తనలో తాను సంశయపడుతూ, అన్నిటికీ సర్దుకుపోతూ కాలక్షేపం చేస్తూందో సుందరమ్మకే అర్థం కాదు.

కాత్యాయని భర్తలో తన కొడుకుల చిన్నప్పటి పోలికలు ఉన్నాయని కాదు.

కాత్యాయని తనను అత్తయ్యగారూ అని ఆప్యాయంగా పిలిచి మచ్చిక చేసుకుంటూ ఉన్నదని కాదు.

సహదేవ్ మళ్లీ అవతరించి తన ఒడిలో ఆడుకుంటున్నాడని కాదు.

రాష్ట్రం కాని రాష్ట్రంలో ఈ పడుచు దంపతులు సాంఘిక (అ)మర్యాదలకు అతీతంగా నడిచినందువల్ల కష్టాలపాలై బతుకు దుఃఖభాజనం చేసుకుంటారని కాదు, బాధపడిపోతారని కాదు.

సుందరమ్మ ఆ ప్రసక్తి తీసుకురాకపోవడానికి ఒక్కటే ఒక్క కారణం-

నలభై ఏళ్ల క్రితం తాను కూడా ఇప్పటి కాత్యాయనిలాగే పెళ్ళికాని తల్లి. తన జీవితం వడ్డించిన విస్తరిగా గడిచిపోతోంది. చేతనయినంత వరకు - తనలాంటి వాళ్ళకు తాను ఆసటగా, బాసటగా నిలవవద్దూ మరి?